క్లుప్తంగా

వర్షాకాలంలో వరికోత వద్దు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏడీ

పుంగనూరు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు వరి పంటను ఒబ్బిడి చేసే కార్యక్రమం వాయిదా వేసుకోవాలని ఏడీ శివకుమార్ తెలిపారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చంద్రమాకులపల్లెలో నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల బీమా కార్యక్రమాలపై కరపత్రాలు విడుదల చేసి, రైతులకు అవగాహన కల్పించారు. ఏడీ మాట్లాడుతూ వరి కోత చేసి ఉంటే తక్షణమే వాటిని గ్రామాల్లోని షెడ్లలోకి తరలించుకోవాలన్నారు. వర్షానికి వరిపంట మొలకెత్తడంతో పాటు నల్లగా మాడిపోతుందని, దీని కారణంగా గిట్టుబాటు ధర లభించదన్నారు. రైతులు వీటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏఓ ఫయాజ్, రైతులు పాల్గొన్నారు.

యాచకుడి మృతి



చౌడేపల్లె: స్థానిక బజారువీధిలోని శివాలయం వద్ద భిక్షాటన చేసుకునే యాచకుడు బుధవారం మృతిచెందాడు. బోయకొండలో భిక్షాటన చేసుకుంటున్న మోహన్ వారం రోజుల క్రితం చౌడేపల్లె శివాలయం వద్దకు చేరుకొని సహచరులతో కలసి భిక్షాటన చేసుకొనేవాడు. ఇతను బుధవారం అస్వస్థతకు గురై ఆలయం వెలుపల గల గోడ వద్ద మృతిచెందిన విషయాన్ని భక్తులు గుర్తించారు. పంచాయతీ ఈఓ మహేష్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు యాచకుడికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఫిట్‌నెస్ లేకుంటే సీజ్ చేస్తాం



వాహన రికార్డులను పరిశీలిస్తున్న ఎంవీఐ

పుంగనూరు: రోడ్డు భద్రతలో భాగంగా డ్రైవర్లకు లైసెన్సులు లేకపోయినా, వాహనాలకు ఫిట్‌నెస్, ఇన్సూరెన్సు, రికార్డులు లేకుంటే వాహనాలను సీజ్ చేస్తామని ఎంవీఐ సుప్రియ తెలిపారు. బుధవారం ఆమె పట్టణంలోని పీఎల్‌ఆర్ బైపాస్‌రోడ్డులో వాహనాల తనిఖీ నిర్వహించారు. పలు వాహనాలకు జరిమానాలు విధించి సీజ్ చేశారు. ఎంవీఐ మాట్లాడుతూ వాహనదారులు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. వాహనయజమానులు, డ్రైవర్లు బాధ్యతగా రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

నేడు పూలే సంస్మరణ దినోత్సవం

పలమనేరు: ఈనెల 28న పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద బడుగుల ఆశాజ్యోతి పూలే సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు బీసీ ఫ్రంట్ నాయకులు గోవిందుస్వామి తెలిపారు. సమావేశంపై స్థానిక పీఆర్ భవనం వద్ద బీసీ నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో బీసీలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రమణమూర్తి, లక్ష్మీపతి, షణ్ముగం, ఆనంద్‌తోపాటు అన్ని మండలాల బీసీ నేతలు పాల్గొన్నారు.

30న చిలకముక్కు చిన్నోడు పుస్తకావిష్కరణ



చిలకముక్కు చిన్నోడు పుస్తకం

పలమనేరు: ఈనెల 30న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో స్థానిక బాలికల గురుకుల పాఠశాల వద్ద డా.హరికిషన్ రచించిన చిలకముక్కు చిన్నోడు పుస్తకావిష్కరణ జరుగుతుందని ఆ సమితి అధ్యక్షుడు తులసీనాథంనాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పిల్లలలో ఆసక్తిని రేకెత్తించే 23 కథలు ఈ పుస్తకంలో ఉన్నాయని అందులో తెలిపారు. కార్యక్రమానికి భాషాభిమానులు, సాహిత్యాభిమానులు విచ్చేసి జయప్రదం చేయాలని ఆయన కోరారు.

లారీ ఢీకొని వీఆర్‌ఓకు తీవ్రగాయాలు

పుంగనూరు: మండలంలోని ఆరడిగుంట వీఆర్‌ఓ వెంకట్రమణాచారి(45) బుధవారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లె నుంచి పుంగనూరుకు విధుల నిమిత్తం వస్తుండగా వెంకట్రమణాచారి తన ద్విచక్రవాహనంలో ఈడిగపల్లె సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వీఆర్‌ఓకు కుడిచేయి విరిగింది. తీవ్ర రక్తగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆయన్ను మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుష్ప విలాపం

- బంతి ధరలు నేల చూపు
- ధరలు లేక పడేస్తున్న రైతులు
- తోటల్లోనే వదిలిపెడుతున్న మరికొంత మంది



ధరలు లేకపోవడంతో తోటల్లోనే వదిలిపెట్టిన బంతి పూలు

కుప్పంరూరల్: బంతి పూల ధరలు నేల చూపులు చూస్తుండడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. కుప్పం మార్కెట్‌లో కిలో ధర రూ.5 నుంచి 10 పలుకుతుండడంతో కోత కూలి రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. రెండు రూపాయలు వస్తుందని ఆశగా పూలను కోసి మార్కెట్‌కు తీసుకొస్తే అక్కడ ధరలు చూసి నిరాశకు గురై మార్కెట్ బయటే పారబోసి వెళ్తున్నారు. ఓ వైపు చామంతి కిలో రూ.100 పలుకుతుండగా, చామంతి అయినా సాగు చేసి ఉంటే బాగుండేదని లోలోన మదనపడుతూ వెళ్తున్నారు. శుభముహూర్తాలు లేకపోవడం, బయటి వ్యాపారులు మార్కెట్‌కు రాకపోవడం కూడా ధరల తగ్గుముఖంపై ప్రభావం చూపుతోంది.

ఎకరా సాగుకు రూ.30 వేల ఖర్చు..

ఎకరా బంతి పూలు సాగు చేయాలంటే ఎకరాకు రూ.30 వేల రూపాయలు ఖర్చు వస్తోంది. 8 వేల మొక్కలు నాటాల్సి ఉండగా, కుప్పం ప్రాంతంలో మొక్క 2 నుంచి 3 రూపాయలు పలుకుతోంది. ఈ లెక్కన మొక్కలే రూ.24 వేలు పలుకుతుంది. దుక్కులు, ఎరువులు, కూలీలు ఇతరత్రాలు కలిపి మరో రూ.30 వేలకు పైగా ఖర్చు వస్తోంది. ఇంత ఖర్చు పెట్టి 45 రోజులు వేచి ఉంటే కోతకు వస్తుంది. ఆరుగాలం కష్టపడినా తీరా పూలు కోతకు వచ్చే సమయంలో ధరలు లేక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఉదయం నుంచి 2 గంటల వరకు పూలు కోతకు వస్తే మహిళలకు రూ.300 ఇవ్వాల్సి ఉంది. నలుగురు మహిళలు కోసినా 500 కిలోలు పూలురావు. మహిళల కూలినే రూ.1200 అవుతుంది. రవాణా మరో వెయ్యి రూపాయలు ఖర్చులు వస్తాయి. ఇలా 500 కిలోల బంతి పూలు మార్కెట్‌కు తరలించాలంటే కోత కూలి, రవాణా ఖర్చు రూ.2,200 వరకు వస్తోంది. మార్కెట్‌లో ధర కిలో 5 పలుకుతుండడంతో 500 కిలోలకు రూ.2,500 మాత్రమే వస్తోంది. కూలీ రవాణా ఖర్చులు రాకపోవడంతో చాలా మంది రైతులు పూలను తోటల్లోనే వదిలిపెడుతున్నారు. మరికొంత మంది తోటలను తొలగిస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..

బంతి, చామంతి ధరలు తరచూ ధరలు హెచ్చు తగ్గులకు గురవుతుండడంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. కుప్పం ప్రాంతంలో వరి తరువాత రైతులు పూల సాగునే ఎక్కువగా చేపడుతున్నారు. ఇలా పంట కోతకు వచ్చే సమయంలో ధరల రూపంలో నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన పూల రైతులకు పెట్టుబడి సాయం అయినా చేయాలని రైతులు కోరుతున్నారు.



మార్కెట్ బయట పారబోసిన బంతి పూలు

సాధారణ కాన్పులే ముద్దు



మాట్లాడుతున్న నిరంజన్‌కుమార్

పలమనేరు: సిజేరియన్లు వద్దు.. సాధారణ కాన్పులే ముద్దు అని వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్ నిరంజన్‌కుమార్ సూచించారు. పట్టణంలోని కాకాతోపు యూపీఎస్సీలో బుధవారం ఇందుకు సంబంధించిన సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు తొలి నుంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కాన్పులు సైతం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజ్మా, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ పాల్గొన్నారు.

చౌడేపల్లె ఎస్‌ఐగా నాగేశ్వరరావు



చౌడేపల్లె: చౌడేపల్లె ఎస్‌ఐగా నాగేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజంపేట నుంచి బదిలీపై చౌడేపల్లెకు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ప్రతాప్‌రెడ్డి కడప జిల్లా కమలాపురానికి బదిలీ అయ్యారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ముమ్మరం చేసి అరికట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులకు ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారం అవసరమన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఎలాంటి సమాచారమిచ్చినా వివరాలు గోప్యంగా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యుకేటర్

పుంగనూరు: ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న బాల్య వివాహాలను, మహిళలపై లైంగిక దాడులను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ చైతన్యవంతులు కావాలని ఏపీపీ హరినాథరెడ్డి కోరారు. బుధవారం పట్టణంలోని కొత్తయిండ్లు ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం లక్ష్మీదేవి, న్యాయవాది టి.వెంకటరమణ న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత పోలీసులకు ఫిర్యాదు చేయాలని, మానసిక స్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు.

బాల్య వివాహాలు హానికరం

బైరెడ్డిపల్లె: బాల్యవివాహాలు చేయడం వలన ఆరోగ్యానికి హానికరమని హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ అన్నారు. బైరెడ్డిపల్లె వెలుగు సమాఖ్య కార్యాలయంలో బుధవారం మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లితండ్రులు ఆడపిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి తీసుకురావాలన్నారు. బాల్య వివాహాలు చేయడం వలన కలిగే అనర్థాలను వివరించారు. ఆరోగ్యసిబ్బంది, వెలుగు మహిళలు పాల్గొన్నారు.

కళాతరంగిణి విద్యార్థుల ప్రతిభ



నృత్యప్రదర్శనలో కళాతరంగిణి విద్యార్థులు

బైరెడ్డిపల్లె: కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో చిత్తూరు ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో మంగళవారం రాత్రి జరిగిన జిల్లా నృత్య పోటీల్లో బైరెడ్డిపల్లె కళాతరంగిణి సంస్థ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రన్నర్స్‌గా గెలుపొందారు. విద్యార్థులు భార్గవి, గీత, గగన, రమ్య, భానుశ్రీ, భరత్‌ను నెహ్రూ యువ కేంద్రం కో–ఆర్డినేటర్ అభినందించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే విద్యార్థులకు ఉత్తమ శిక్షణ అందించిన కళాతరంగిణి సంస్థ వ్యవస్థాపకులు రాజేష్‌బాబును సత్కరించారు.

సాగుపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

రామకుప్పం: మండలంలోని ముద్దనపల్లిలో బుధవారం ఏరిస్ అగ్రో లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు పంటలు పండించడంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏరిస్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జయప్రదీప్ మాట్లాడుతూ నేల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని భూసార పరీక్షలు నిర్వహిస్తూ సమగ్ర పోషక యాజమాన్యం ద్వారా పంటల్లో అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. దీంతో రైతులు అధిక లాభాలను పొందే అవకాశం ఉందన్నారు. సంస్థ ప్రతినిధులు రత్నయ్య, మాధవ్, వెంకటేశ్వరరావు, సుందర్‌రాజు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ల తనిఖీ



ఆధార్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న రమణారెడ్డి

పలమనేరు: ప్రస్తుతం విద్యార్థులకు అపార్ సేవల కోసం ఆధార్‌లో మార్పులు, చేర్పులు సాగుతున్న నేపథ్యంలో ఆధార్ సెంటర్లలో సేవలు త్వరితగతిన అందాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు. ఆమేరకు పట్టణంలోని పలు ఆధార్ కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అక్కడున్న సిబ్బందితో మాట్లాడి పెండింగ్ దరఖాస్తులను వెంటనే చేపట్టాలన్నారు. పట్టణంలో సాగుతున్న పన్నుల వసూళ్లను నేరుగా గమనించారు. అదేవిధంగా మున్సిపాలిటీలో సాగుతున్న ఇంటింటి జియో ట్యాగింగ్, ఎస్‌పీసీఐ సర్వేను ఆయన తనిఖీ చేశారు.

ఎంబీసీ కుల సంఘాల నియామకం



నియామక పత్రాలను అందజేస్తున్న దృశ్యం

కుప్పం: అత్యంత వెనుకబడిన కుల సంఘాల నియామకాలను చేపట్టారు. బుధవారం కుప్పం బీసీ కార్యాలయంలో సంచార జాతుల సంఘ అధ్యక్షుడు పూల రవి అధ్యక్షతన ఎంబీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యంత వెనుకబడిన కుల సంఘాల జిల్లా ఉపాధ్యక్షుడిగా శివతేవర్, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడిగా శాంతిపురానికి చెందిన కృష్ణామూర్తి, నియోజకవర్గ అధ్యక్షుడిగా మురళీని నియమించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు శివ మాట్లాడుతూ, జిల్లాలోని అత్యంత వెనుకబడిన కులస్తులను అన్నివిధాల ఆదుకునేందుకు తన వంతు కృషిచేస్తామని ఆయన ఈ సందర్భంగా అన్నారు. సభ్యులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలపై ఆసక్తి చూపాలి



పొలం పిలుస్తోందిలో అధికారులు, రైతులు

బైరెడ్డిపల్లె: రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులతో పంటలు సాగు చేయడం వలన తక్కువ ఖర్చుతో దిగుబడి అధికంగా వస్తుందని జిల్లా వ్యవసాయశాఖాధికారి మురళీక్రిష్ణ అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లెలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీ పంట కాలంలో వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలనే సాగు చేసుకోవాలని సూచించారు. వేరుశనగ, టమాట, వరి సాగు చేసుకునే రైతులు ప్రీమియం చెల్లించి రైతు సేవా కేంద్రాల్లో పంట బీమా చేసుకోవాలన్నారు. వ్యవసాయశాఖాధికారిణి గీతాకుమారి, ఉద్యానవనశాఖాధికారిణి లక్ష్మీ ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

మదర్‌థెరిసాలో మెగా జాబ్‌మేళా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి

గంగవరం: మండలంలోని మదర్‌థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కరస్పాండెంట్ రవీంద్రబాబు బుధవారం తెలిపారు. మొత్తం 25 కంపెనీల ప్రతినిధులు తమ కళాశాలలో డిగ్రీ, ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులను వివిధ రకాల ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటారని తెలిపారు. ఇందులో సాఫ్ట్‌వేర్, కోర్ కంపెనీలు, సేల్స్ ఉద్యోగాలు సైతం ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి జాబ్‌మేళాను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జాబ్‌మేళాను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ముగ్గురు మైనర్లకు కౌన్సెలింగ్

చౌడేపల్లె: మండలంలోని బత్తలాపురం గ్రామానికి చెందిన ముగ్గురు మైనర్ బాలురకు పోలీసులు బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముగ్గురు మైనర్లు బైక్‌లపై ఉన్నత పాఠశాల ఆవరణలో బైక్ రైడింగ్ చేయడం, విద్యార్థినుల పట్ల దురుసుగా వ్యవహరించడంతో పోలీసులు మైనర్ బాలురతోపాటు వారి తల్లితండ్రులతో కలసి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. మరోమారు పునరావృత్తం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోండి



గొంగివారిపల్లెలో మాట్లాడుతున్న అధికారులు

సదుం: రైతు సంఘాలు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ పీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. బూరగమంద, చెరుకువారిపల్లె, గొంగివారిపల్లె, పాలమంద పంచాయతీలలో రైతు సంఘాల సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యకు ప్రభుత్వం రూ.35 లక్షల నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు. దీని ద్వారా సంఘాలకు అవసరమైన ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు కొనుగోలు చేసుకుని సంఘాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. డీహెచ్‌ఓ మధుసూదన్ రెడ్డి, పీడీ బాలసుబ్రహ్మణ్యం, రమేష్ రెడ్డి, గాయత్రి పాల్గొన్నారు.

గరిటెడైనను చాలు ఖరము పాలు..!

గంగిగోవు పాలు గరిటెడైనను చాలు
కడవడైననేమి ఖరము పాలు..
ఇదీ వేమన ఆనాడు చెప్పిన పద్యం..

అయితే అదే వేమన ఇప్పుడు ఉంటే– గాడిద పాల రేటు వేల రూపాయల్లో ఉండడం చూసి విస్తుపోకమానడు. తాను చెప్పిన పద్యాన్ని సవరించి పైవిధంగా చెప్పేవారే మరి! ఒకప్పుడు స్కూళ్లలో చదువుల్లో బాగా వెనుకబడిన విద్యార్థులను టీచర్లు కోపం కొద్దీ.. ఒరేయ్ గాడిదా..గాడిదలు మేపుకోండి పోంరా..! అని తిట్టేవాళ్లు. వాళ్లు తెలిసి తిట్టారో, తెలియక తిట్టారోగానీ ఆవు పాల రేటుతో పోల్చితే తమ పాలకు పిచ్చ డిమాండ్ ఉందని పుంగనూరులో గాడిదలు సగర్వంగా ఓండ్రపెడుతున్నాయి. వాటి పాలకు ఉన్న రేటు చూసి ఆవులు కూడా అసూయ చెందాల్సిందే మరి.



పుంగనూరులో గాడిదలతో వెళుతున్న అశోక్ దంపతులు. (ఇన్‌సెట్) పాలాడులో పాలు విక్రయిస్తున్న దృశ్యం

- గోవు పాలు రూ.50, గాడిద పాలు వేలల్లో
- పాలాడు పాలు రూ.250

పుంగనూరు: పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉన్న అశోక్ పదేళ్లుగా గాడిదలపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మొత్తం ఏడు గాడిదలు అతనికి ఉన్నాయి. తన భార్య సంధ్య కలసి వీధుల్లో రెండు గాడిదలను తోలుకువస్తూ ఉదయం 7గంటల నుంచి ఆ జంట.. 'గాడిద పాలమ్మో..' అని గట్టిగా కేకలు వేయడం ఆలస్యం ప్రజలు వాటి పాలకోసం ఎగబడుతున్నారు. చంటి బిడ్డలు, చిన్నారులకు గాడిద పాలు పట్టిస్తే వ్యాధులు దరిచేరవనే నమ్మకం ఉండడం.. వాటి ధర ఎక్కువైనా కొనేందుకు వెనుకాడడం లేదు. లీటరు ఆవు పాల ధర రూ.50 అయితే, కేవలం ఉగ్గుపాల గిన్నె (పాలాడు) గాడిద పాలే అక్షరాలా 250 రూపాయలు..! అదీనూ మహా అయితే 10 ఎంఎల్ నుంచి 20ఎంఎల్ వరకే..! ఈ లెక్కన లీటరు పాలను ఎంతకు అమ్ముతున్నారో లెక్కలేసుకుంటే కళ్లు బైర్లు కమ్మకమానవు. రోజుకు సగటున రూ.2వేల వరకు సంపాదిస్తున్నారు. ఒక్కో గాడిద అర లీటరు నుంచి లీటరు పాలు ఇస్తుందని అశోక్ దంపతులు చెప్పారు. గాడిదల పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు చెప్పారు. ఒక్కో గాడిద రూ.20 వేల నుంచి రూ.30వేల వరకే ఉండడం, ఆవులతో పోల్చితే పోషణ ఖర్చు కూడా చాలా తక్కువ కావడంలో వీరికి గాడిదల పెంపకం, వాటి పాల వ్యాపారం మంచి ఆదాయ వనరుగా మారింది.

గాడిద పాలలో ఔషధ గుణాలు

గాడిద పాలలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ పాలలో కొవ్వుశాతం తక్కువగా ఉండడం, విటమిన్–డి పుష్కలంగా ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా యాంటీ మైక్రోబయాల్ లక్షణాలు కలిగి ఉండడంతో ఆర్థరైటిస్, దగ్గు, జలుబు, ఇన్‌ఫెక్షన్‌ను తగ్గించడంలోను, రోగ నిరోధకశక్తి పెంచడానికి దోహదపడుతుంది. అలాగే మహిళలు వినియోగించే సౌందర్య ఉత్పత్తులు, షాంపులు, ఫేస్‌క్రీమ్‌లు, స్కిన్‌క్రీములు, సబ్బుల తయారీలో గాడిద పాల వినియోగం అధికంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. అలాగే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి ఈ పాలు దివ్యౌషధమని వైద్యుల్లు చెబుతున్నారు.

వర్చువల్ విధానంలో మండల పాలన

- మొదటిసారిగా మండల సమావేశం ప్రారంభించిన ఎమ్మెల్సీ శ్రీకాంత్



వర్చువల్ విధానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

కుప్పం: వర్చువల్ విధానంలో కుప్పం మండల పాలన ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ సాయిలహరి తెలిపారు. బుధవారం కుప్పం మండల సర్వసభ్య సమావేశం తొలిసారిగా వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. మండలం పరిషత్ కార్యాలయంతో పాటు మండలం పరిధిలోని సచివాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. వర్చువల్ విధానాన్ని బుధవారం ఎమ్మెల్సీ శ్రీకాంత్ ప్రారంభించారు. మొట్టమొదటి సారిగా కుప్పం మండలంలో వర్చువల్ విధానంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కావడంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఎంపీపీ అశ్విని, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, టీడీపీ పాలక మండల సభ్యులు శాంతారాం స్థానిక పాల్గొన్నారు,

ఏఎంసీలో చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



జేసీబీతో చెత్త తీస్తున్న దృశ్యం

పలమనేరు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో పేరుకుపోయిన చెత్తను సంబంధిత కాంట్రాక్టర్ ద్వారా బుధవారం తొలగించారు. 'ఏఎంసీలో పేరుకుపోయిన చెత్త' అనే శీర్షికన మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవకుమార్ స్పందించి కాంట్రాక్టర్ నాగిరెడ్డి ద్వారా జేసీబీతో మార్కెట్ ఆవరణలోని చెత్తను శుభ్రం చేయించారు. ఆ వ్యర్థాలను ట్రాక్టర్లతో తరలించారు. దీంతోపాటు మండీ వ్యాపారులు, రైతులతో వేర్వేరుగా సమావేశాలను ఆయన ఏర్పాటు చేశారు. మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. టమాట మండీల నిర్వాహకులు కాయల వేలాలను వారి మండీల వద్ద మాత్రమే చేపట్టాలన్నారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వేలం వేయడంతో ట్రాఫిక్ సమస్యతో పాటు చెత్త ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారని తెలిపారు. దీనికి సంబంధించి మండీ యజమానులు, రైతులు సైతం సలహాలు, సూచనలను చేశారు. మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.